ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 29 అక్టోబరు 2024



మెదడులో భూకంపం

» ఆందోళనకు గురిచేస్తున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు

» నేడు అంతర్జాతీయ బ్రెయిన్ స్ట్రోక్ డే -8లో



వేదనకు గురిచేసే సోరియాసిస్

» వ్యాధిగ్రస్తులను వేధిస్తున్న ఆత్మహత్య ఆలోచనలు, డిప్రెషన్, యాంగ్జైటీ

» నేడు సోరియాసిస్ వ్యతిరేక దినం -8లో

ఎయిర్ కార్గో ఎన్నడో!?

ఇతర దేశాలకు సరకు రవాణాలో సమస్యలు

» మూడు విమానాలున్నా ఒక్క టన్నూ కదలని వైనం

» ఇతర ఎయిర్‌పోర్టులు, సముద్రమార్గంపై ఆధారపడాల్సిన పరిస్థితి

» హామీలు ఇస్తున్నా అమలులో తాత్సారం

» తాజాగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి సమస్య



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖను అభివృద్ధిలో ఎక్కడికో తీసుకువెళతామని రాజకీయ నాయకులు హామీలు గుప్పిస్తూ ఉంటారు. కానీ ఇక్కడి నుంచి ఒక్క టన్ను సరకును కూడా విమానాల ద్వారా విదేశాలకు పంపలేకపోతున్నారు. ఇది ఇప్పటి సమస్య కాదు. సుమారు పదిహేనేళ్లుగా... కేంద్ర మంత్రిగా పనిచేసిన పురందేశ్వరి కాలం నుంచి ఈ సమస్య ఉంది. ఆమె, ఆ తరువాత ఎంపీ హరిబాబు వారి స్థాయిలో సమస్య పరిష్కారానికి యత్నించారు. ఢిల్లీలో పెద్దలతో మాట్లాడి అవసరమైనవి సమకూర్చారు. కానీ కార్గో మాత్రం వెళ్లడం లేదు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వందలాది పరిశ్రమలు ఉన్నాయి. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. అత్యధికం విశాఖపట్నం నుంచే విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కానీ, విమానంలో వెళ్లడం లేదు. అంతా ఇతర ఎయిర్‌పోర్టులు, సముద్ర మార్గాల్లో వెళుతోంది. అలాగే పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలు తమ మందులను విదేశాలకు సరఫరా చేస్తున్నాయి. వారు కూడా హైదరాబాద్, చెన్నైలకు రోడ్డుమార్గాన తరలించి, అక్కడి నుంచి విమానాల్లో ఇతర దేశాలకు పంపుకుంటున్నారు.

ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) విమానాశ్రయాల్లో భద్రతా వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. చాలా విమానాశ్రయాల్లో సరకులను విమాన సంస్థలే స్కానింగ్ చేసుకుంటున్నాయని, అది సరైన విధానం కాదని, విమానాశ్రయాలే భద్రతాపరమైన అన్ని పనులు చేయాలని రెండేళ్ల క్రితం ఆదేశించింది. ఆ నిబంధనలు పాటించని విమానాశ్రయాల నుంచి సరకు రవాణా ఆపేసింది. ఈ క్రమంలో విశాఖ విమానాశ్రయంలో అవసరమైన స్కానర్లు, సుశిక్షితులైన సిబ్బందిని సమకూర్చుకున్నారు. ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తుల తనిఖీకి డ్రగ్ కంట్రోల్ అధికారి పోస్టు మంజూరైంది. ప్రాణాలతో ఉన్న సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి యానిమల్ క్వారంటైన్ అధికారి పోస్టు కూడా ఇచ్చారు. మందులు, పండ్లు, పూలు చెడిపోకుండా నిల్వ చేయడానికి ప్రత్యేకంగా టెంపరేచర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అయితే విమానాల్లోకి సరకు ఎక్కించడానికి ప్రత్యేకమైన లిఫ్టులు కావాలి. అలాగే సరకును భద్రంగా చేర్చడానికి 'కస్టోడియన్' ఉండాలి. ఈ రెండూ లేకపోవడం వల్ల విదేశాలకు సరకు వెళ్లడం లేదు.

విశాఖపట్నం నుంచి సింగపూర్, మలేషియా, థాయ్‌ల్యాండ్‌లకు అంతర్జాతీయ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. సింగపూర్ (స్కూట్ ఎయిర్‌లైన్స్) విమానం వారానికి నాలుగుసార్లు, మలేషియా, థాయ్‌ల్యాండ్లకు ఎయిర్ ఏసియా వారానికి మూడుసార్లు చొప్పున సర్వీసులు నడుపుతున్నాయి. అంటే వారానికి విశాఖ నుంచి పది విమానాలు వెళుతున్నట్టు లెక్క. నెలకు 40 విమానాలు. ఒక్కో విమానంలో కనీసం రోజుకు రెండు టన్నుల సరకు పంపించినా నెలకు 80 టన్నులు పంపించుకోవచ్చు. ఒక్కో విమానం సీటింగ్ సామర్థ్యం 180 సీట్లు. సగటున ఈ మూడు సర్వీసులు 50 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. మిగిలిన 50 శాతం సీట్లను (మనుషుల బరువు) సరకుతో నింపుకొంటే వాటికి

... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్

» 31న సిలిండర్లు డెలివరీ



» జిల్లాలో 5.29 లక్షల మంది బియ్యం కార్డుదారులకు లబ్ధి

» ఏడాదికి రూ.128.7 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన లబ్ధిదారులకు దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సిలిండర్ బుక్ చేసుకునేందుకు మంగళవారం నుంచి అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించింది. మంగళవారం బుక్ చేసుకున్న వారికి ఈనెల 31వ తేదీ దీపావళి రోజున సిలిండర్లు డెలివరీ ఇస్తారు. డెలివరీ సమయం లేదా ముందుగా (ఆన్‌లైన్‌లో) గ్యాస్ ఏజెన్సీకి రూ.811 చెల్లించాలి. ఆ మొత్తాన్ని తరువాత ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది. బియ్యం కార్డుదారులంతా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా పొందవచ్చు. ఏప్రిల్ నుంచి జూలై వరకు ఒకటి, ఆగస్టు నుంచి నవంబరు వరకూ మరొకటి, డిసెంబరు నుంచి మార్చి 31 వరకు ఇంకొకటి.. ఇలా ఏడాదిలో మూడు సిలిండర్లు ఉచితంగా పొందవచ్చునని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఆధార్ కార్డు, ఆధార్ కార్డుతో అనుసంధానమైన బ్యాంకు ఖాతా నంబరు ఉండాలి. కాగా విశాఖ జిల్లాలో 5.29 లక్షల మంది బియ్యం కార్డుదారులు ఉన్నారు. ఏడాదికి ఒక్కొక్కరికి రూ.2,433 (విశాఖలో సిలిండరు ధర రూ.811) మేర లబ్ధి చేకూరనున్నది. ఈ లెక్కన ఏడాదికి జిల్లాలో గల

... మిగతా 6వ పేజీలో

మొక్కల పేరుతో మెక్కేశారు

ఏడాది కిందట సాగర్‌నగర్ వద్ద సముద్ర తీరంలో పది హెక్టార్లలో సరుగుడు మొక్కలు నాటిన అటవీ శాఖ



మొక్కలు నాటిన ప్రాంతం

» సంరక్షణ కోసం రూ.40 లక్షలు ఇచ్చిన పోర్టు

» అధికారుల నిర్లక్ష్యం

» ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పేరిట నిధులు దుర్వినియోగం

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

భీమిలి బీచ్‌రోడ్డులో సాగర్‌నగర్ వద్ద సముద్ర తీరంలో సరుగుడు మొక్కల పెంపకం పేరిట భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సముద్ర కోత నివారణ, తుపాన్ గాలుల నుంచి రక్షణ నిమిత్తం గుడ్లవానిపాలెం ఫారెస్టు బ్లాక్ పరిధిలో సాగర్‌నగర్ వద్ద తీరంలో 10 హెక్టార్ల మేర గత ఏడాది జూలైలో 25 వేల సరుగుడు మొక్కలు (కొన్ని బాదం, తదితరాలు ఉన్నాయి) నాటారు. ఇందుకు విశాఖ పోర్టు సుమారు రూ.40 లక్షలు ఇచ్చింది. మొక్కలు పెంపకంతోపాటు పది హెక్టార్ల చుట్టూ ఫెన్సింగ్‌కు ఈ నిధులు వెచ్చిస్తామని అటవీ శాఖాధికారులు వెల్లడించారు. ఫెన్సింగ్‌కు రూ.18 లక్షలు, మొక్కలు పెంపకానికి రూ.22 లక్షలు కేటాయించారు.

అయితే మొక్కలు నాటిన తరువాత వాటి సంరక్షణలో అటవీ శాఖ విఫలమైంది. మొక్కలు పెంపకంలో కీలకమైన నీటి కోసం అక్కడక్కడా చలమలు తవ్వినా నీరు పడలేదు. అటువంటప్పుడు అక్కడే రెండు, మూడుచోట్ల బోర్లు తవ్వి మధ్యలో ట్యాంకులు ఏర్పాటుచేసి మొక్కలకు నీరు

... మిగతా 6వ పేజీలో



నాటకుండా వదిలేసిన మొక్కలు

స్టీల్‌ప్లాంటు అధికారి అనుమానాస్పద మృతి

» కుమార్తె ఐపీఎస్ అధికారిణి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):



మైసర్ల వెంకటరావు (ఫైల్ ఫొటో)

విశాఖ స్టీల్‌ప్లాంటులోని ఎస్ఎంఎస్ (స్టీల్ మెల్ట్ షాప్)-1లో సీనియర్ మేనేజర్ (ఎలక్ట్రికల్)గా విధులు నిర్వహిస్తున్న మైసర్ల వెంకటరావు (58) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీనియర్ మేనేజర్ వెంకటరావు దంపతులు స్టీల్ ప్లాంటు సెక్టార్-10లోని క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన భార్య కొంతకాలంగా బెంగళూరులో కుమారుడి వద్ద ఉంటున్నారు. ఆదివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన వెంకటరావు తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన బంధువు సత్యనారాయణ సోమవారం ఉదయం స్టీల్‌ప్లాంటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆయన కారు స్టీల్‌ప్లాంటు సమీపాన గల కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో కనిపించింది. దీంతో రిజర్వాయర్‌లో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. వాకింగ్‌కు వెళ్లిన వెంకటరావు రిజర్వాయర్ గట్టుపై కూర్చునే సమయంలో ప్రమాదశాత్తూ జారి పడిపోయి ఉంటారని బంధువులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా వెంకటరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె లక్ష్మి సౌజన్య పాండిచ్చేరిలో ఐపీఎస్ అధికారిణి కాగా, కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు.

వీఆర్ఎస్ సర్వేకు నేటితో గడువు పూర్తి

» 2వేల మందికి సానుకూలం

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు ఉద్యోగుల్లో 45 ఏళ్లు దాటిన వారిని స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) కింద ఇంటికి పంపించే ప్రణాళికలు కేంద్రం సిద్ధం చేసింది. ఈ విషయం నేరుగా చెప్పకుండా కేవలం సర్వే మాత్రమే అంటూ వారం రోజులుగా ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు సేకరించడం ప్రారంభించింది. వీఆర్ఎస్ అంగీకారమైతే ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు

... మిగతా 6వ పేజీలో

జ్వరం, ఒళ్లు నొప్పులు

నగరంలో భారీగా నమోదవుతున్న కేసులు



» చికున్ గున్యా తరహా లక్షణాలు

» మంచినీటి బాటిల్‌ను కూడా మోయలేని పరిస్థితి

» ఆందోళన చెందుతున్న రోగులు

» పరీక్షలు చేయించుకోకపోవడంతో నిర్ధారణ కాని పరిస్థితి

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

నగరంలో తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ వైద్యుల వద్దకు వస్తున్న రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. జనరల్ ఫిజిషియన్స్‌ను ఆశ్రయిస్తున్న వారిలో సుమారు 70 శాతం మందిలో ఈ లక్షణాలే కనిపిస్తున్నాయని చెబుతున్నారు. సాధారణంగా ఈ లక్షణాలుంటే చికున్‌గున్యాగా భావిస్తారు. అయితే జిల్లాలో అటువంటి కేసులు నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ 77 మందికి పరీక్షలు నిర్వహించగా, ఒక్క కేసు మాత్రమే నమోదయిందంటున్నారు.

ప్రస్తుతం జ్వర పీడితుల్లో చికున్‌గున్యా, డెంగ్యూ, టైఫాయిడ్ లక్షణాల కలబోత కనిపిస్తోందని, దీంతో వ్యాధి నిర్ధారణ కష్టమవుతోందని వైద్యులు చెబుతున్నారు. కొన్నిరకాల మందులు ఇస్తే వారం, పది రోజుల్లో జ్వరం తగ్గుతోందని, బాడీ, జాయింట్ పెయిన్స్, నీరసం కొన్నిరోజులు, కొందరిలో కొన్ని వారాలు ఉంటున్నాయంటున్నారు. మరికొంతమంది మంచి నీళ్ల సీసాను కూడా తీసుకోలేని స్థితిలో ఉన్నారని, ఇటువంటి కేసులకు పరీక్షలు నిర్వహిస్తే చికున్‌గున్యా పాజిటివ్ వస్తుందని చెబుతున్నారు. కానీ పరీక్ష చేయించుకునేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపించడం లేదంటున్నారు.

ఇవీ లక్షణాలు..

చికున్ గున్యా జ్వరం ఎడిస్ ఈజిప్ట్ రకానికి చెందిన దోమ కుట్టడం వల్ల వస్తుంది. దీనిని అరుదైన విషజ్వరంగా చెబుతారు. వీరిలో తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు, చర్మంపై దద్దుర్లు ఉంటాయి. చేతులు, కాళ్లు, వేళ్లు ముడుచుకోవడానికి కూడా ఇబ్బంది ఎదురవుతుంది. చిన్నపాటి బరువులను ఎత్తడానికి కూడా బలం సరిపోదు. ఇటువంటి లక్షణాలు ఉంటే చికున్‌గున్యాగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం చికున్‌గున్యా నిర్ధారణకు ర్యాపిడ్ పరీక్షను ప్రైవేటు ఆస్పత్రుల్లో చేస్తున్నారు. ఇందులో పాజిటివ్ వచ్చినా నిర్ధారించరు. కేజీహెచ్‌లోని ల్యాబ్‌లో ఐజీఎం/మాక్ ఎలీసా పరీక్ష నిర్వహించి నిర్ధారిస్తారు.

బాడీ/జాయింట్ పెయిన్స్

రెండు, మూడు నెలలుగా నమోదవుతున్న జ్వర కేసులు భిన్నంగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. గతంలో చూడని రీతిలో తీవ్రమైన జ్వరం, బాడీ, జాయింట్ పెయిన్స్ కనిపిస్తున్నాయంటున్నారు. చికున్‌గున్యా తరహా లక్షణాలతో వచ్చిన ఓ వ్యక్తికి ఆ పరీక్షతోపాటు

... మిగతా 6వ పేజీలో

నేడు ఓటర్ల జాబితా విడుదల

» నెలపాటు అభ్యంతరాల స్వీకరణ

» జనవరి ఒకటో తేదీన మలి జాబితా విడుదల

» కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా ఓటర్ల వివరాలు తెలుపుతూ తొలి జాబితా మంగళవారం విడుదల చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక సమాచారం ప్రకారం గతం కంటే జిల్లాలో 71 వేల మంది ఓటర్లు పెరిగారని, అయితే పూర్తి వివరాలతో కూడిన జాబితా మంగళవారం విడుదల చేస్తామన్నారు. ఓటర్ల జాబితాలు అన్ని బూత్ లెవెల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతామని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా అందజేస్తామన్నారు. వాటిపై అభ్యంతరాలు ఉంటే వచ్చే నెల 28వ తేదీలోగా తెలియజేయాలని కోరారు. తొలి జాబితా విడుదలైనప్పటి నుంచి

... మిగతా 6వ పేజీలో



ధర్నాలో పాల్గొన్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి

» సెయిల్‌లో విలీనం చేయండి

» ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించాలి

» హెచ్ఆర్ఏ పునరుద్ధరించాలి

» ఉక్కు పరిపాలనా భవనం ఎదుట కార్మిక సంఘాల ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు సోమవారం ఉక్కు కర్మాగారంలోని ప్రధాన పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తేనే ఉపాధి అవకాశాలు బాగుంటాయన్నారు. అలాగే ఉద్యోగులకు,

... మిగతా 6వ పేజీలో

అనధికార మందుగుండు సామగ్రి స్వాధీనం

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని దాకమర్రి సమీపంలో ఉన్న లేఅవుట్‌లో అనధికారికంగా నిల్వ చేసిన మందుగుండు సామగ్రిని భీమిలి పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు దాసరి వెంకన్నను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. అనుమతి లేకుండా పేలుడు పదార్థాలను తయారు చేయడం, విక్రయించడం నిషేధమని ఎస్‌ఐ గౌరి తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఆరు వినతులు

భీమునిపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆరు వినతులు అందాయి. జోనల్ కమిషనర్ ప్రసన్న వాణి వినతులను స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, ఇంజనీరింగ్ విభాగానికి నాలుగు వినతులు వచ్చాయని ఆమె తెలిపారు. వాటిని ఆయా విభాగాలకు పంపించామని చెప్పారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ చేస్తున్న అర్చకులు

సింహాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. తరువాత ఉత్సవమూర్తిని రజిత గరుడ వాహనంపై ఉంచి గరుడ సేవ నిర్వహించారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

హెచ్‌ఐవీపై అవగాహన

భీమునిపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన అవసరమని స్థానిక సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ ఆర్‌వీ రాజు అన్నారు. సోమవారం ఎస్‌వీఎల్ ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎలా వస్తుందన్నది వివరించారు. యువత మత్తు పదార్థాల జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోరాదని సూచించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళా సాహితీ సంస్థ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం సభ్యులు

భీమునిపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాదిలో కళా సాహితీ సంస్థ ద్వారా పేద కళాకారులను ఆదుకోవడంతో పాటు ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తామని ఆ సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో కళా సాహితి సర్వసభ్య సమావేశం జరిగింది. రెండేళ్ల కాలపరిమితికి గానూ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రేలంగి అప్పలనరసయ్య, అధ్యక్షుడిగా పీఆర్‌పీ వర్మ, ప్రధాన కార్యదర్శిగా అడిదం సన్యాసిరాజు, కోశాధికారిగా కాళ్ల సన్ని ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా కంటుభుక్త రామానాయుడు, మునుకుట్ల కోటయ్య, పిట్ట సురేశ్, ఖైలపల్లి లక్ష్మణరావు, ఎస్. జోగారావు, కార్యదర్శులుగా పోలిపిల్లి శ్రీనివాసరావు, అడిదం కిశోర్, మునునూరి సూర్యశ్రీనివాసరావు, పోతిన అరవింద్, కిలాని అప్పారావు, ఎల్. ఆదినారాయణ ఎన్నికయ్యారు. భవిష్యత్తులో కళాసాహితి కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు.

బాలికల పట్ల రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అసభ్యకర ప్రవర్తన

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి తన ఇంటి చుట్టూ ఉన్న బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో స్థానికులు సోమవారం రాత్రి అతని ఇంటిపై దాడికి పాల్పడ్డారు. మధురవాడలోని డీబీ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆప్రాంతంలోని బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో స్థానికులు ఆగ్రహంతో అతని ఇంటిపైకి దాడికి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించారు. సీఐ జి. బాలకృష్ణ వివరాలు సేకరిస్తున్నారు. మహిళల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసే అవకాశం ఉంది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్



బాలికకు పలు సూచనలు ఇస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

దేశాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

- విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్
- సైన్స్ పట్ల ఆసక్తి ఉండాలి : కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- కొమ్మాది గురుకులంలో జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

కొమ్మాది, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సమాజ అభివృద్ధిలో సైన్స్ పాత్ర ఎంతో కీలకమని విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలకు సృజనాత్మకతను జోడించి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కొమ్మాది రిక్షా కాలనీలో ఉన్న గురుకుల బాలికల కళాశాలలో జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి, సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ మానవ జీవితంలో ఎంత ముఖ్యమో, మానవతా విలువలు కూడా అంతే ముఖ్యమన్నారు. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు.కాగా జోనల్ స్థాయిలో నిర్వహించి ఈప్రదర్శనకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 30కి పైగా గురుకుల పాఠశాలలు పాల్గొనగా 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. జల వనరుల నిర్వహణ, పార్కింగ్ సమస్యలకు పరిష్కారం, సోలార్ విద్యుత్ వినియోగం, గృహ నిర్మాణాల వ్యర్థ నిర్వహణ, తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిని ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రామారావు, ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త రూపవతి, శ్రీకాకుళం జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్. బాలాజీ నాయక్, విజయనగరం జిల్లా కో-ఆర్డినేటర్ ఫ్లోరెన్స్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యంతోనే సైబర్ నేరాలు అదుపు

- వాట్ సదస్సులో ఎంపీ శ్రీభరత్, నగర పోలీస్ కమిషనర్ శంఖబత్రబాగ్చి



సదస్సులో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు

సాగర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల ద్వారానే వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చేరుతోందని, సామాజిక చైతన్యంతోనే ఈ తరహా నేరాలను అదుపు చేయగలమని విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు. గీతం వర్సిటీ మహిళా సాధికారిక విభాగం, టెక్ మాంత్రిక్ ఐటీ సంస్థ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన ఉమెన్ అండ్ టెక్నాలజీ సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలు మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు.సాంకేతికంగా విద్యావంతులైన మహిళలు సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడంతో పాటు నేరస్తులకు చట్ట ప్రకారం శిక్ష పడే వరకు సామాజిక కార్యకర్తలుగా కృషి చేయాలని చెప్పారు. నగర సీపీ శంఖబ్రాతబాగ్చి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, ఫొటోలు ఎవరితోనూ పంచుకోరాదని తెలిపారు. సైబర్ నేరస్తులు ఒంటరి మహిళలు, నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన వారు ఏవిధమైన దాపరికం లేకుండా పోలీసులకు తక్షణ సమాచారం అందించాలని చెప్పారు. సింబయాసిస్ అధినేత నరేశ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్నెట్ యూజర్లు వ్యక్తిగత సమాచార గోప్యతను పాటించాలని, ఎలాంటి వివరాలు సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలో తెలిసి వుండాలన్నారు. హిందూ దినపత్రిక రెసిడెంట్ ఎడిటర్ సుమిత్ భట్టాచార్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల కంటే చదువుకున్న వారేఎక్కువగా సైబర్ నేరాల బారిన పడుతున్నారని చెప్పారు. రక్షణ దళాల చర్చల్లో కూడా సైబర్ నేరాలను ఎలా అదుపు చేయాలన్నది అంశంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో గీతం ఈఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్‌కుమార్, టెక్ మాంత్రిక్ సీఈఓ సూర్య, గీతం మహిళా సాధికారిక విభాగం అధ్యక్షురాలు డాక్టర్ బీవీ శ్రీవిద్య, ఐద్వా మహిళా సంస్థ కార్యదర్శి రమాదేవి, జిమ్‌సర్ సైకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వి. నివేదిత, గీతం న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్. చిత్ర సక్సేన, ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. లక్ష్మి, ఎంజే శ్రీకాంత్ , తదితరులు పాల్గొన్నారు.



మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం

ఆండాళ్ తిరు నక్షత్ర తిరువీధి

సింహాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఆండాళ్ అమ్మవారి తిరు నక్షత్ర పూజలను సోమవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తి మదనగోపాలస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక పల్లకిలో ఉంచి పూజలు చేశారు. అనంతరం ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితులు వేద పారాయణలు జరుగుతుండగా భక్తుల గోవిందనామస్మరణల నడుమ మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం వైభవంగా జరిపారు. మార్గంలో పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలు, ఫలాలను సమర్పించి స్వామివారిని స్వాగతించారు.



ఎమ్మెల్యే గణబాబును సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నడకతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే గణబాబు

సింహాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యానికి నడక ఎంతగానో దోహదం చేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం ఉదయం పాత గోశాల కూడలి నుంచి వేపగుంట వరకు నడక పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గణబాబు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గొర్లె నాగార్జున, కార్యదర్శి శ్రీహరి, గవర్నర్ రంగారావు, వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి. సూర్యనారాయణ, కవి రామకృష్ణ పాల్గొన్నారు.

త్వరలో సాగుదారుల హక్కు చట్టం-2024

- వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్
- ఇకపై ఏటా జూన్ నుంచి పంట రుణాలు, కౌలు కార్డులు జారీ



బుడితి రాజశేఖర్

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు, కౌలుదారుల ప్రయోజనం కోసం ప్రభుత్వం కొత్తగా సాగుదారుల హక్కు చట్టం-2024 తీసుకువస్తోందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వ్యవసాయ అధికారులు, రైతులు, కౌలుదారులతో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ పంటసాగు చట్టం-2019లో ఉన్న లోపాలను పరిగణనలోకి తీసుకుని రైతులు, కౌలుదారులకు మరింత మేలు చేసేలా సాగుదారుల హక్కు చట్టం తీసుకువచ్చేందుకు అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలను క్రోడీకరించి సమగ్రమైన చట్టం తీసుకువస్తామన్నారు. పంటల కోసం ఏప్రిల్‌లో కాకుండా ఖరీఫ్ సీజన్ ప్రారంభం అంటే జూన్‌లో రుణాలు, కౌలుదారులకు కార్డులు ఇప్పించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశమన్నారు. సకాలంలో రుణాల మంజూరుతో సాగు వైపు ప్రోత్సహించవచ్చునన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్. ఢిల్లీరావు మాట్లాడుతూ 2019లో రూపొందించిన చట్టంలో లోపాలు, త్వరలో అమలులోకి తీసుకురానున్న చట్టంలో పొందుపరిచిన పలు అంశాలను వివరిస్తూ..రైతులు, కౌలుదారులు తగిన సూచనలు చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వ్యవసాయ శాఖ అదనపు కమిషనర్ శ్రీధర్, ఇతర అధికారులు పద్మావతి, ఎం.గోపాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి అప్పలస్వామి, రైతులు,పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయిర్ కార్గో ఎన్నడో!?

... 5వ పేజీ తరువాయి

కూడా లాభదాయకం.

ఏమి కావాలంటే..?

అంతర్జాతీయ కార్గో వ్యవహారాలను పర్యవేక్షించే సిబ్బందితో పాటు కస్టోడియన్ అవసరం. వీటిని ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సమకూర్చాల్సి ఉంది.

కేంద్ర మంత్రి చొరవ

విశాఖ నుంచి విజయవాడకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభించడానికి ఆదివారం ఇక్కడకు వచ్చిన కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధి నరేశ్‌కుమార్ ఎయిర్ కార్గో సమస్యను వివరించారు. ఇటీవల విశాఖ వచ్చిన మంత్రి లోకేశ్ దృష్టికి కూడా స్థానిక ఎంపీ శ్రీభరత్ ద్వారా ఈ సమస్యను తీసుకువెళ్లినట్టు చెప్పడంతో ఆయన వెంటనే స్పందించారు. ఢిల్లీలోని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, కార్గో రవాణాకు అవసరమైన సిబ్బందిని వీలైతే చెన్నై నుంచి విశాఖకు డిప్యుటేషన్‌పై పంపాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా కార్గో విదేశాలకు వెళ్లేలా చూడాలని సూచించారు. ఇది ఎంతవరకు అమలు అవుతుందో వేచిచూడాలి.

నేటి నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్

... 5వ పేజీ తరువాయి

5.29 లక్షల మంది లబ్ధిదారులకు ఉచిత సిలిండర్ల పంపిణీ నిమిత్తం రూ.128.7 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనున్నది. కాగా ఉచిత సిలిండర్ పొందే సమయంలో ఇబ్బందులుంటే సమీపంలో గ్యాస్ ఏజెన్సీకి లేదా పౌర సరఫరాల శాఖ కార్యాలయాలకు వెళ్లి అధికారులను సంప్రతించాలని జేసీ కోరారు. ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ సిలిండర్లు దుర్వినియోగం చేయవద్దని కోరారు.

మొక్కల పేరుతో మెక్కేశారు

... 5వ పేజీ తరువాయి

అందేలా చూడాలి. అందుకు బదులు బయట నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించి పోయడం ప్రారంభించారు. వేసవిలో నీరు అందించే విషయంలో నిర్లక్ష్యం చూపారు. బయట నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశామని పేర్కొంటూ కిందిస్థాయి అధికారులు తప్పుడు లెక్కలు చూపించి సొమ్ములు దిగమింగారంటున్నారు. దీనికితోడు మొక్కల చుట్టూ కలుపుతీయకుండా వదిలేశారు. దీంతో కొన్ని మొక్కలు చనిపోగా, మరికొన్ని నాటినవి నాటినట్టుగానే ఉన్నాయి. కొద్దిమొక్కలు మాత్రమే ఒక అడుగు నుంచి రెండు అడుగుల ఎత్తు వరకు పెరిగాయి. కేవలం అధికారుల పర్యవేక్షణ కొరవడంతో మొక్కల పెంపకం ఉద్దేశం నెరవేరలేదు. సంరక్షణ పేరిట నిధులు భారీగా స్వాహా చేశారనే వాదన వినిపిస్తోంది. కాగా చుట్టూవేసిన ఫెన్సింగ్ చాలా వరకు తుప్పు పట్టింది. కొన్నిచోట్ల ఫెన్సింగ్‌ను దొంగలు ఎత్తుకుపోయారు.

మొక్కలు లెక్కించాలని ఆదేశాలు

ఇటీవల అటవీ శాఖ రేంజర్, డీఎఫ్‌వో, సీసీఎఫ్ బదిలీ అయ్యారు. సీసీఎఫ్, రేంజర్ కొత్తగా రాగా డీఎఫ్‌వో పోస్టు ఇంకా భర్తీ చేయలేదు. కొత్తగా వచ్చిన రేంజర్ శాస్త్రి సాగర్‌నగర్ సమీపంలో నాటిన సరుగుడు మొక్కలు పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ ఎన్ని మొక్కలు ఉన్నాయి?, ఎన్ని చనిపోయాయనేది తేల్చాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. పొదల మధ్యన ఉన్న మొక్కలు లెక్కించడం ఎలా సాధ్యమని సిబ్బంది అడుగుతున్నారు. కలుపు తీసిన తరువాతే మొక్కలు లెక్కించడం సాధ్యపడుతుందని అంటున్నారు. ఈ మొక్కల పెంపకం కోసం పోర్టు ఇచ్చిన నిధులు వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, నిలిపివేసిన హెచ్‌ఆర్‌ఏ, ఇతర ఆర్థిక ప్రయోజనాలను పునరుద్ధరించాలని, టౌన్‌షిప్ నివాసితులకు విద్యుత్ బిల్లు తగ్గించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తికి తగిన వనరులు కల్పించాలన్నారు. సెప్టెంబరు నెల జీతం ఇప్పటివరకూ ఇంకా పూర్తిగా ఇవ్వలేదని, తక్షణం అందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జె. అయోధ్యరాం, ఎస్.మోహన్‌బాబు, జె.రామకృష్ణ, నీరుకొండ రామచంద్రరావు, రామస్వామి, పీవీ రమణమూర్తి, పీవీ నగేష్, జి.గణపతిరెడ్డి, విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, సురేష్‌బాబు, పరందామయ్య, జి.ఆనంద్ పాల్గొన్నారు.



పవిత్రాలను తీసుకువస్తున్న వేద పండితులు

ఘనంగా అనంత పద్మనాభుని పవిత్రోత్సవాలు

పద్మనాభం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ప్రత్యేక పూజలు అనంతరం పవిత్రాలను వేద పండితులు మేళతాళాలతో ఆలయంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మహా హోమం నిర్వహించారు. కాగా బీజేపీ నాయకుడు రూపాకుల రవికుమార్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మండల బీజేపీ నాయకుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు ఆలయ అభివృద్ధికి రూ. 15 వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పైడిరాజు, సన్నిబాబు, ఆర్. సన్యాసిరావు బోని సన్యాసినాయుడు, బీజేపీ యువమోర్చా నాయకుడు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

భీమునిపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ భీమిలి జోనల్ పారిశుధ్య కార్మికుల కమిటీ గౌరవాధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. సోమవారం భీమిలి జోనల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా పనిముట్లు సరఫరా చేయడం లేదని, ఏడాది క్రితం చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబీకులకు ఉద్యోగాలు ఇవ్వలేదని తెలిపారు. అలాగే అనారోగ్యంతో పనిచేస్తున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబీకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్మికులకు రావలసిన సబ్బులు, నూనెలు, రెయిన్ కోట్‌లను వెంటనే అందించాలని, 16 రోజుల సమ్మె కాలంలో ఒప్పందం ప్రకారం రూ. వెయ్యి చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం నాయకులు జడ్సీ ప్రసన్నకు వినతిపత్రం అందించారు.

ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి : సీపీఐ

తగరపువలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :తగరపువలసలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఏర్పాటుకు పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తగరపువలస సీపీఐ కార్యాలయంలో వారు సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మోర అప్పలరాజు, జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు మాట్లాడుతూ తగరపువలసలో ఆర్‌టీసీ కాంప్లెక్సు ఏర్పాటు ఎంతో అవసరమని చెప్పారు. ఈ ప్రాంతంలో బస్ షెల్టర్లు కూడా ఎక్కువ సంఖ్యలో నిర్మించాలని కోరారు. అలాగే రైతుబజార్‌ను త్వరగా ప్రారంభించి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అల్లు బాబూరావు, ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపైడి, తదితరులు పాల్గొన్నారు.

జూట్‌మిల్లు ఆస్తుల విక్రయం అడ్డుకోవాలని వినతి



జడ్సీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తగరపువలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం ఆస్తుల అమ్మకానికి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని లాకౌట్ బాధితుల సంఘం కోరింది. సోమవారం వారు భీమిలిలోని జోనల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అలాగే సబ్ రిజిస్ట్రార్, కార్మిక శాఖ అధికారులకు కూడా వినతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాజమాన్యంపై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, తాము కూడా హైకోర్టులో కేసు వేశామన్నారు. ఈనేపథ్యంలో మిల్లు యాజమాన్యం ఆస్తుల అమ్మకానికి ప్రయత్నించడం సరికాదని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా ఆస్తులను కొనుగోలు చేస్తే వారే నష్టపోతారని తెలిపారు. కార్యక్రమంలో లాకౌట్ బాధితుల సంఘం ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరమణ, గౌరవాధ్యక్షుడు నాగోతి అప్పలరాజు, ఏబాల తాతారావు, శివ, బాలయ్యరెడ్డి, రమణ, పాల్గొన్నారు.

నేడు ఓటర్ల జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

నెలరోజులపాటు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. అభ్యంతరాలను పరిష్కరించిన తరువాత వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీన మలి జాబితా విడుదలవుతుందన్నారు. అనంతరం జనవరి ఆరో తేదీన సవరణ ప్రచురిస్తామన్నారు. ఈ క్రమంలో వచ్చే నెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానిశంకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, సోడదాసు సుధాకర్, కృష్ణకాంత్, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

వీఆర్ఎస్ సర్వేకు నేటితో గడువు పూర్తి

... 5వ పేజీ తరువాయి

పొందుపరచాలని సూచించింది. కనీసం 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలని షరతు పెట్టింది. దీనికి ఉద్యోగుల నుంచి ఆశించిన దానికంటే ఎక్కువగా స్పందన వచ్చింది. ఈనెల 29వ వరకు అభిప్రాయాలు చెప్పేందుకు గడువు ఉండగా 28వ తేదీ అంటే సోమవారం నాటికి రెండు వేల మంది సానుకూలత వ్యక్తం చేశారు. యాజమాన్యం ఇచ్చేపరిహారం తీసుకువెళ్లిపోయేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

జ్వరం, ఒళ్లు నొప్పులు

... 5వ పేజీ తరువాయి

డెంగ్యూ, మలేరియా పరీక్షలు చేయిస్తే నెగెటివ్ వచ్చిందని, టైఫాయిడ్ పాజిటివ్ వచ్చిందని ఓ వైద్యుడు తెలిపారు. కొందరిలో లక్షణాలు కనిపించక పోయినా పాజిటివ్ వస్తుందని, లక్షణాలతో బాధపడుతున్న వారికి నెగిటివ్ వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ప్రాణాంతక స్థాయిలో సమస్య లేకపోవడం ఉపశమనం కలిగిస్తోందంటున్నారు.

ఆందోళన వద్దు

కొద్దిరోజులుగా నమోదవుతున్న కేసులన్నీ భిన్నంగా ఉంటున్నాయి. ఒకే విధమైన లక్షణాలు కనిపిస్తున్నాయి. కొంతమందికి టైఫాయిడ్ పాజిటివ్ వస్తోంది. మరికొందరికి డెంగ్యూ పాజిటివ్ వస్తోంది. ఇంకొందరికి మలేరియా పాజిటివ్ వస్తోంది. అందరిలోనూ తీవ్ర జ్వరం, బాడీ, జాయింట్ పెయిన్స్ కనిపిస్తున్నాయి. కొందరిలో ఫీవర్ లేకుండా కేవలం నొప్పులు మాత్రమే ఉంటున్నాయి. దీంతో పరీక్షలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతిరోజూ రెండు, మూడు చికున్‌గున్యా తరహా కేసులు వస్తున్నాయి. కానీ, నిర్ధారణ కాలేదు. వీటిని ఎటిపికల్ ప్రజంటేషన్‌గా భావించి మందులిస్తున్నాం.

- డాక్టర్ వై.జ్ఞానసుందరరాజు,
విశ్రాంత జనరల్ మెడిసిన్ విభాగ వైద్యులు, కేజీహెచ్

చికున్ గున్యా కేసుల్లేవ్

జిల్లాలో చికున్ గున్యా కేసులు నమోదు కాలేదు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 77 మందికి పరీక్షలు చేస్తే ఒకే ఒక్క పాజిటివ్ కేసు వచ్చింది. ప్రస్తుతం కనిపిస్తున్న కేసుల్లో ఎక్కువగా టైఫాయిడ్ ఉంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 2,22,187 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా 133 పాజిటివ్ వచ్చాయి. 6,473 మందికి డెంగ్యూ పరీక్ష నిర్వహించగా 572 మందికి పాజిటివ్ వచ్చింది. అనుమానిత కేసులుంటే పరీక్షలు నిర్వహిస్తాం. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ ఎం.తులసి, జిల్లా మలేరియా అధికారి



విద్యార్థి మహేశ్‌తో హెచ్‌ఎం, తదితరులు

క్రీడల్లో కణితి విద్యార్థి ప్రతిభ

కూర్మన్నపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి విజయనగరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 హ్యాండ్ బాల్ టోర్నమెంటులో కణితి హైస్కూల్ విద్యార్థి కె.మహేశ్ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా మహేశ్‌ను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.మన్నాజీ, నారాయణరావులు అభినందించారు.

సమస్యలపై పెన్షనర్ల సమావేశం

అగనంపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి సీడబ్ల్యూసీ ప్రాంగణంలో స్టీల్‌ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగులు ఈపీఎస్-95 సమస్య, తదితర అంశాలపై సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉగ్యోగుల సంఘం ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ కేంద్ర కార్మిక శాఖ రూ.7,500 పించన్ ఇవ్వడానికి సానుకూలంగా ఉందని, రానున్న పార్లమెంటు సమవేశాల్లో ప్రకటించే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే స్టీల్‌ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పించన్ గురించి మంత్రి డోలా వీరాంజనేయులను కలిసి కోరామన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరరావు, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్' కార్డులు పంపిణీ

గాజువాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్స్‌లకు బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు సోమవారం ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. పెదగంట్యాడ పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీఎం మోదీ ప్రజలందరి సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టారని, వీటిని ఆశ వర్కర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన తెలుగు యువత నాయకులు

గాజువాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ చైర్మన్ ఎ.రవి కుమార్ నాయుడును తిరుపతిలో తెలుగు యువత గాజువాక అధ్యక్షుడు బలగ బాలు నాయుడు ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి గాజువాకలో క్రీడాభివృద్ధికి సహకరించాలని కోరారు. వికాస్‌నగర్‌లో స్విమ్మింగ్‌పూల్‌ను ఆధునీకరించి ప్రారంభించాలని పేర్కొన్నారు.

సినిమా గైడ్

● **వీనస్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **పొట్టేల్ :** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)

● **దేవర :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● **వేట్టయాన్ :** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **విశ్వం :** శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 38, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 52, పచ్చిమిర్చి 48 కాకరకాయలు 44, బీరకాయలు 30, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 54, దొండకాయలు 50, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 7, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 60, బరబాటి 50, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 52, కీరదోస 30, క్యాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 28, కంద 68, దేముడుచిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ పెండలం 30, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

నడిరోడ్డుపై గోతులు

యాతపాలెంలో ప్రమాదకరంగా మారిన యూజీడీ పిట్ హోల్స్

రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెదగంట్యాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 64వ వార్డు పరిధి యాతపాలెం ప్రధాన వీధిలోని రహదారులపై ఉన్న గోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ సిమెంటు రోడ్డు వేసేటప్పుడు యూజీడీ పిట్ హోల్ మూతలను తీసేందుకు, మూసేందుకు వీలుగా ఖాళీ స్థలాన్ని విడిచిపెట్టారు. రోడ్డు నిర్మాణ పనులు ముగిశాక పిట్ హోళ్లను సరిచేసి వాటి మూతలను రోడ్డుకు సమాంతరంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే సిబ్బంది అలా చేయకపోవడంతో పిట్ హోల్ ఉన్న ప్రాంతంలో సుమారు అడుగు లోతు గొయ్యి ఏర్పడింది. ఈ మార్గంలో ఉన్న అన్ని పిట్ హోల్స్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, ఆటోలు, కార్లు, ట్రక్కులు నడిపే వారితో పాటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. యాతపాలెంలోని పది వీధులను కలిపే ఈ ప్రధాన రహదారిలో అన్ని కూడళ్లలో ఇదే పరిస్థితి నెలకొనడంతో రాత్రి వేళల్లో మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు వీటి గురించి పట్టించుకోకపోవడంతో స్థానికులే గోతులను పూడ్చేందుకు రాళ్లు, మట్టి వంటివి వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు సమాంతరంగా యూజీడీ పిట్ హోల్స్ ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





64వ వార్డు పరిధి యాతపాలెం ప్రధాన రహదారిలో ఉన్న గోతులు

ఉద్యోగులంతా నిబద్ధతతో పనిచేయాలి

విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమంలో ఉక్కు ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరూ నీతి, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఏకే సక్సేనా కోరారు. ఉక్కు కర్మాగారంలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ఇన్‌చార్జి సీఎండీ ఏకే సక్సేనా, పలువురు డైరెక్టర్లు, సీవీవోలు అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. దేశ శ్రేయస్సు కోసం సమగ్రత-సంస్కృతి అనే థీమ్‌తో పారదర్శకత, సమగ్రత, జవాబుదారీతనం పట్ల నిబద్ధతను ధ్రువీకరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ముందుగా సక్సేనా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్.కరుణరాజు, డైరెక్టర్లు ఎస్‌సీ పాండే (పర్సనల్), సీహెచ్‌ఎస్‌ఆర్‌వీజీకే గణేశ్ (ఫైనాన్స్), జీవీఎన్.ప్రసాద్ (కమర్షియల్), ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏకే సక్సేనా



వీఎస్‌ఈజెడ్‌లో ప్రమాణం చేయిస్తున్న డీసీ ముప్పాల శ్రీనివాస్

వీఎస్‌ఈజెడ్‌లో విజిలెన్స్ వారోత్సవాలు

కూర్మన్నపాలెం: దువ్వాడ వీఎస్‌ఈజెడ్ పరిపాలనా భవనంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్ ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది సమక్షంలో ఇంటిగ్రిటీ ప్రతిజ్ఞను చదివి వినిపించడంతో పాటు వారితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి సందేశాలను అందరికీ వినిపించారు. వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్ర మాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీసీలు ప్రసన్నకుమార్, కె.శ్రీనివాస్, ఐఆర్‌ఎస్ వర్మ, కస్టమ్స్ అధికారి శివ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పేదరిక నిర్మూలనకే మెప్మా : ఎమ్మెల్యే

మల్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేదరిక నిర్మూలనకే పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పనిచేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) తెలిపారు. శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి ప్రాంగణంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో పేద మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు మెప్మా దోహదపడుతుందన్నారు. డ్వాక్రా సంఘాలకు బ్యాంకులు ఇచ్చే రుణాన్ని పెట్టుబడిగా పెట్టి సొంతంగా వస్తువులను తయారుచేసి మార్కెట్‌లో విక్రయించడం ద్వారా స్వయం ఉపాధి లభిస్తుందన్నారు. మార్కెట్‌లో మహిళలు 30 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో బ్యాగ్‌లు, దుస్తులు, సబ్బులు, ఫినాయిల్, పిండివంటలు, బొమ్మలు తదితర వస్తువులను విక్రయానికి ఉంచారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ రాము, నేతలు నక్కా లక్ష్మణరావు, రామ్మోహన్‌నాయుడు, మితిరెడ్డి శంకర్, మాతా శ్రీను, మజ్జి సోమేష్, పొత్తబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మెప్మా మార్కెట్‌ను పరిశీలిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



సభ్యత్వ నమోదును ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు

సభ్యత్వ నమోదులో రికార్డు సృష్టిద్దాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అత్యధిక సభ్యత్వాలు చేసి రికార్డు సృష్టించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 85వ వార్డు పరిధిలో సోమవారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజలంతా ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. టీడీపీ సభ్యత్వం అంటే ఓ భరోసా అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, కర్రి దశేంద్ర, ప్రసాద్, అప్పారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలి

అగనంపూడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శ్రీనివాసనగర్, అన్నపూర్ణా నగర్ ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతూ ఈపీడీసీఎల్ ఏఈ లక్ష్మణ్‌కు టీడీపీ వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ సోమవారం వినతిపత్రం అందజేశారు. వీధి రోడ్ల మధ్యలో స్తంభాలు ఉండడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మరికొన్నిచోట్ల శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నందున వాటిని తొలగించాలని పేర్కొన్నారు. ఏఈని కలిసిన వారిలో నాయకులు జి.వెంకటరావు, టి.రేవతి, సంజీవి, జి.అప్పారావు, గంగమ్మ, తదితరులు ఉన్నారు.



విమానాశ్రయంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు స్వాగతం

గోపాలపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం రాత్రి 8 గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్న బండి సంజయ్‌కు ఎచ్చెర్ల శాసనసభ్యుడు నడుకుదుటి ఈశ్వరరావు, బీజేపీ రాష్ట్ర ప్రొటోకాల్ కన్వీనర్ బాల రాజేశ్వరరావు, నగర బీజేపీ నేతలు మహేష్, దీపికా అగర్వాల్, సునీల్‌కుమా ర్, వంశీ, కె.నర్సింగరావు, దామోదర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి బయలుదేరి వెళ్లారు.

సంత స్థలాన్ని గ్రామాభివృద్ధికి ఇవ్వాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ కోసం అక్కిరెడ్డిపాలెంలో సేకరించిన సంత స్థలాన్ని తిరిగి గ్రామాభివృద్ధి కోసం అప్పగించాలని సీపీఎం గాజువాక డివిజన్ నాయకులు సోమవారం కలెక్టర్‌ను ప్రజా సమస్యస పరిష్కార వేదిక కార్యక్రమంలో కలిసి కోరారు. సర్వే నంబర్ 47/3లో ఉన్న మూడెకరాల సంత స్థలాన్ని విశాఖ డెయిరీ యాజమాన్యం సుమారు 30 ఏళ్ల క్రితం తీసుకుందన్నారు. ఈ స్థలంలో కేవలం మొక్కలు పెంచుతూ వృథాగా ఉంచినందున గ్రామాభివృద్ధి కోసం అప్పగించేలా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.నూకేశ్వరరావు, వి.అప్పలరాజు, వరదాడ వెంకటరమణ, శీరం అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న బాణసంచా దుకాణాలు

మల్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని ఏపీఐఐసీ స్థలంలో బాణసంచా విక్రయాలకు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. సుమారు 46 దుకాణాలకు అనుమతులు లభించాయి. స్టాళ్ల మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చర్యలు తీసుకున్నారు. జీవీఎంసీ, పోలీసులు మైదానం పరిశీలించి సూచనలిచ్చారు.

ఎన్ఏడీ సమీపంలో...

ఎన్ఏడీజంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఏడీ ఫ్లైఓవర్ దిగువ బస్టాప్ వెనుక బాణసంచా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మొత్తం 14 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. పోలీసుల నుంచి అనుమతులు రాగానే స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించనున్నారు. ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: సీఐ

పెందుర్తి: బాణసంచా వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు అనధికార విక్రయాలు చేపట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. దుకాణాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల ఎన్‌ఓసీతో పాటు అగ్నిమాపక, విద్యుత్ అనుమతులుండాలన్నారు. పెందుర్తిలో దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించామన్నారు.



గాజువాక ఆర్టీసీ డిపో ఏపీఐఐసీ మైదానంలో ఏర్పాటుచేస్తున్న స్టాల్స్



ఎన్ఏడీ సమీపంలో ఏర్పాటవుతున్న దుకాణాలు



జోనల్ కార్యాలయం ముందు కూర్చుని నినాదాలు చేస్తున్న కార్మికులు

జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా

గాజువాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, పని ముట్లు అందజేయాలని, జీతంలో కోత విధించరాదని, మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు రాజకీయ నాయకుల సేవ ఎక్కువగా ఉంటుందని, బయట కన్నా వారి ఇళ్ల వద్దే ఎక్కువ పని ఉంటుందని పేర్కొన్నారు. పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహించే వారందరినీ ఫీల్డ్ వర్క్‌కు పంపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, కేవీ రమణ, కిరీటం, రాము, మీనాక్షి, సత్యవతి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డును సందర్శించిన విజ్ఞాన్ విద్యార్థులు



షిప్‌యార్డులో విజ్ఞాన్ ఎంబీఏ విద్యార్థులు, తదితరులు

అగనంపూడి. అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దువ్వాడలోని విజ్ఞాన్ ఎంబీఏ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులు సోమవారం హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆధునిక నౌకల నిర్మాణ సౌకర్యాలు, డ్రై డాక్స్, అసెంబ్లీ లైన్లను విద్యార్థులు తిలకించారు. ఆధునిక సాంకేతికత, నౌకల నిర్మాణ ప్రక్రియ, తదితర అంశాల గురించి హెచ్‌ఎస్‌ఎల్ నిపుణులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, హెచ్‌వోడీ బి.చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అనాథలు, కూలీలకు ఆహార పొట్లాలు పంపిణీ



బీహెచ్‌పీవీ కూడలిలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న కేజీఆర్ యువసేన సభ్యులు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుంగ్లాం కాలనీలో సోమవారం నిర్వహించిన కాకి కుంచారావు 33వ వర్థంతి కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు అభిమానులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుంచారావు కుమారుడు, 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, కేజీఆర్ యువసేన సభ్యులు షీలానగర్ నుంచి లంకెలపాలెం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న అనాథలు, భిక్షగాళ్లు, రోజువారీ కూలీలకు ఆహార పొట్లాలు, తాగునీరు, ఇతర తినుబండారాలను పంపిణీ చేశారు.

'టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా'

పెందుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని, రూ.100 సభ్యత్వ రుసుంతో రూ.5లక్షల బీమా అందుతుందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు అన్నారు. మండలంలోని రాంపురంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు సోమవారం ఆయన శ్రీకారం చుట్టారు. యాప్‌లో వివరాల నమోదు చేశారు. నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బంగారునాయడు, శ్రీధర్, కిశోర్‌చౌదరి, సారధి, శ్రీను, వెంకటరమణ, శంకరరావు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న రెడ్డి నారాయణరావు

ఉత్సాహంగా వాకర్స్ క్లబ్ నడక పోటీలు

వేపగుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పాతగోశాల జంక్షన్‌లో సోమవారం వరహాలక్ష్మీ నరసింహ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పురుషుల, మహిళల నడక పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఉదయం వేళల్లో నడిచే నడక కారణంగా ఆరోగ్యంతో పాటు, ఆహ్లాదం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. గత 12 ఏళ్లుగా క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం క్లబ్ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. పోటీల్లో గెలుపొందిన వాకర్స్‌కు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.ఎల్.ఎన్. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జి.నాగార్జున, 101 పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.సూర్యనారాయణ, డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ టి.రంగారావు, ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, ఉప్పలపాటి శుభ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు వినతులు

వేపగుంట అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ఐదు ఫిర్యాదులందాయి. కృష్ణరాయపురంలో అక్రమ నిర్మాణం నిలిపివేయాలని, సుజాతానగర్‌లో పిచ్చిమొక్కలు తొలగించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి దీపాలు ఏర్పాటు చేయాలని, సింహపురి కాలనీలో విద్యుత్తు స్తంభాలు తొలగించాలని, పద్మావతినగర్‌లో పిచ్చిమొక్కలు తొలగించాలని ఫిర్యాదులు అందాయి. జెడ్సీ కె.హైమావతి వినతులు స్వీకరించారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

మల్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్డివీధిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు కుమారుడు మౌర్యసింహ సోమవారం స్వామిని దర్శనం చేసుకున్నారు. మజ్జి సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ముమ్మన దేముడు, తదితరులు

పెందుర్తిరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం, శివగాయత్రీనగర్, ఆర్టీసీ కాలనీలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటరు ముమ్మన దేముడు కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనరు చిట్టిబోయిన శంకరరావు, నేతలు శ్రీకాంత్, గురునాథ్, ప్రసాద్, వెంకట సంతోష్ పాల్గొన్నారు.

పరిష్కారం చూపండి



వినతులు స్వీకరిస్తున్న జడ్సీ రాము

జ్ఞానాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలనుంచి వచ్చే వినతులను సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ బి.రాము సూచించారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 4 వినతులను స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 1, ప్రజారోగ్యం 1, రెవెన్యూ విభాగానికి 2 అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ టి.ఎస్ఎన్.రాజు, ఏసీపీ వెంకట్రావు, ఏఎంహెచ్ఓ సునీల్ కుమార్, ఆర్ఓలు బాబు రావు, రాజ్యలక్ష్మి, ఏపీడీ పుణ్యవతి, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలువురు విచ్చేసి తమ అర్జీలను అందచేశారు. తహసీల్దార్ రమేష్ వాటిని పరిశీలించారు. సత్వరమే ధ్రువపత్రాలు అందచేస్తామన్నారు.

జీతాలు అందక ఆయాల అవస్థలు

కంచరపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసే ఆయాలకు (టీఎంఎఫ్) నాలుగు నెలలుగా జీతాలందక ఇబ్బందులు పడుతున్నారు. వీరికి నెలకు రూ.6 వేల గౌరవ వేతనంతో పాఠశాలల్లో నియమించారు. ఇస్తున్న అరకొర మొత్తం కూడా ప్రతినెలా అందకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుతో పలుచోట్ల ఆయాలు తమ విధుల నుంచి తప్పుకొంటున్నారు. తమ జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

'పాలసీలపై బోనస్ పెంచాలి'



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న గజపతిరావు

సీతమ్మధార, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) బ్రాంచ్ కార్యాలయం వద్ద ఏజెంట్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లియాఫి ఛైర్మన్ ఎస్.గజపతిరావు, ఆలిండియా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కె.వి.రమణలు విచ్చేశారు. యాజమాన్య మొండి వైఖరి విడనాడాలన్నారు. బ్రాంచ్ ప్రెసిడెంట్ బి.బంగార్రాజు మాట్లాడుతూ పాలసీలపై జీఎస్టీ తొలగించాలని, పాలసీదారులబోనస్, ఏజెంట్ల కమిషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ల సంఘం కార్యదర్శి రాంబోతు అప్పారావు, రమణమూర్తి, శ్రీనివాస్, నర్సింగరావు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

అక్కయ్యపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నరసింహనగర్ రైతుబజారు సమీపంలో అక్రమ మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై కె.సత్యనారాయణ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. మద్యం విక్రేతను అరెస్ట్ చేశారు. అతడు బార్ అండ్ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద 78 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'మద్యం దుకాణాల్లో పని చేసిన వారికి ఉపాధి చూపండి'

అల్లిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాల్లో పనిచేసిన సుమారు 15 వేల మంది సిబ్బందికి ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అల్లిపురంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్ మేనేజర్లుగా పనిచేసినవారు నేడు ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డున పడ్డారని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, కె.అచ్యుతరావు, సంఘం అధ్యక్షుడు మోహన్ రావు, హరినాధరావు, గణేష్ మహాదేవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కౌట్స్, గైడ్స్ శిబిరం



ముగింపు శిబిరంలో పాల్గొన్న స్కౌట్స్

అక్కయ్యపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో జరుగుతున్న స్కౌట్, గైడ్స్ శిబిరం సోమవారం ముగిసింది. ప్రథమ చికిత్సపై విజయలక్ష్మి అవగాహన కల్పించారు. ఏఎల్‌టీ స్కౌట్ నేషనల్ మెడల్ అవార్డు గ్రహీత ఎస్ఎస్ మూర్తి స్కౌట్ అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ధ్రువీకరణ పత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్, క్యాంప్ ఇన్‌చార్జ్ రమేష్, కుందన్ లాల్ పాల్గొన్నారు.

ఈ రోడ్డు ఎవరి జాగీరు?



మళ్లసూరివీధిలో మెయిన్ రోడ్డును ఆక్రమించి ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్లు

కంచరపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి మళ్లసూరివారి వీధిలో రోడ్డును ఆక్రమించి ప్రైవేటు అపార్టుమెంట్ల యజమానులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధిలో సీపీ బ్రౌన్ స్కూల్‌ను ఆనుకుని మూడు బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. వీటికి ప్రధాన రోడ్డు మీదే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. బహుళ అంతస్తుల లోపల ఏర్పాటు చేయాల్సిన వీటిని ఇలా బయట ఉంచడంలో విద్యుత్ శాఖలో పని చేస్తున్న దిగువస్థాయి సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు కీలక భూమిక పోషిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవనాల యజమానులకు, అధికారులకు మధ్య వారధిలా ఉంటూ వీరే 'సర్దుబాట్లు' చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి ఫిర్యాదులు మరీ ఎక్కువగా వస్తున్నాయి. సంబంధిత బిల్డర్లతో సిబ్బంది లాలూచీపడి నిబంధనలకు తూట్లు పొడుస్తుండడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. మళ్ల సూరివీధిలో మూడు భవనాల్లో రెండింటికి ఇప్పటికే రోడ్డును ఆక్రమించి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. మరో భవనానికి ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడానికి అంతా సిద్ధం చేసి రోడ్డు మీద దిమ్మను కూడా నిర్మించారు. విచిత్రం ఏంటంటే.. ఇదే వీధిలో వార్డు సచివాలయం ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. నిబంధనలు గాలికొదిలేసినా అధికారులు, సిబ్బంది నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జ్ఞానాపురంలో అధ్వానంగా రోడ్లు



గతుకుల మయంగా సెబాస్టియన్ కాలనీ రోడ్డు

జ్ఞానాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 41వవార్డు జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీ, బాబుకాలనీల్లో రోడ్లు అధ్వా నంగా ఉన్నాయి. ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. కాలనీలో ఏ రోడ్డు చూసినా గతుకులమయమే. కొన్నిచోట్ల రోడ్లను తవ్వి వదిలేయడంతో వర్షాలు పడి బురదగా మారుతున్నాయి. 24 గంటల నీటి సరఫరా కోసం తవ్విన గుంతలు పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో రోడ్డంతా రాళ్లు, పలకలుతేలి ఉన్నా యి. ఆయా రోడ్లపై ప్రయాణించేటప్పుడు అనేకమంది ప్రమాదాలు జరిగి గాయపడుతున్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో చీకటిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు జోన్-5 ఇంజనీరింగ్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నవంబరుకల్లా
జగదాంబ జంక్షన్‌లో మరో సొబగు



లేపాక్షి జంక్షన్ వద్ద నిర్మిస్తున్న వాటర్ ఫౌంటెన్

జగదాంబ కూడలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖకు తలమానికంగా ఉన్న జగదాంబ జంక్షన్ క్రమంగా కొత్త అందాలు సంతరించు కుంటోంది. ఈ కూడలిలో ఇప్పటికే క్లాక్ టవర్ నిర్మించారు. లేపాక్షి జంక్షన్ వద్ద ఇప్పుడు జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం రూ.14 లక్షలతో వాటర్ ఫౌంటెన్ నిర్మిస్తోంది. ఈ కూడలి మధ్యలో నందీశ్వరుడు, రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేక సొబగులు చేకూరనున్నాయి. నగర సుందరీకరణలో భాగంగా లేపాక్షి జంక్షన్‌ను తీర్చిదిద్దుతున్నారు. కేజీహెచ్ డౌన్, జగదాంబ నుంచి వన్‌టౌన్ వెళ్లే మెయిన్ రోడ్డులో పోలీస్ సిగ్నల్ వద్ద పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నవంబరు నాటికి లేపాక్షి జంక్షన్ సరికొత్త అందాలతో నగరవాసులను ఆకర్షించనుంది.

సమాజాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

- ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్
- కొమ్మాది గురుకులంలో జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్



విద్యార్థినితో ముచ్చటిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కొమ్మాది, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):: సమాజ అభివృద్ధిలో సైన్స్ పాత్ర ఎంతో కీలకమని విశాఖ ఎంపీ ఎమ్. శ్రీభరత్ అన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలకు సృజనాత్మకతను జోడించి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కొమ్మాది రిక్షా కాలనీలో ఉన్న గురుకుల ప్రతిభా బాలికల కళాశాలలో జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి, సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడానికి ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ మానవ జీవితంలో ఎంత ముఖ్యమో, మానవతా విలువలు కూడా అంతే అవసరమన్నారు. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నమూనాలు తయారు చేసిన కొందరు విద్యార్థినులతో కలెక్టర్ ముచ్చటించారు. జోనల్ స్థాయిలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 30కి పైగా గురుకుల పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. జల వనరుల నిర్వహణ, పార్కింగ్ సమస్యలకు పరిష్కారం, సోలార్ విద్యుత్ వినియోగం, గృహ నిర్మాణాల వ్యర్థాల నిర్వహణ, తదితర అంశాలపై విద్యార్థులు నమూనాలు ప్రదర్శించారు. వీటిని ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త రూపవతి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కో-ఆర్డినేటర్లు ఎన్.బాలాజీ నాయక్, ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సాగుదారుల హక్కు చట్టం

- వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్
- ఏటా జూన్ నుంచి పంట రుణాలు, కౌలు కార్డులు జారీ



బుడితి రాజశేఖర్

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు, కౌలుదారుల ప్రయోజనం కోసం ప్రభుత్వం కొత్తగా సాగుదారుల హక్కు చట్టం-2024 తీసుకువస్తోందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వ్యవసాయ అధికారులు, రైతులు, కౌలుదారులతో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ పంట సాగు చట్టం-2019లో ఉన్న లోపాలను పరిగణనలోకి తీసుకుని రైతులు, కౌలుదారులకు మరింత మేలు చేసేలా సాగుదారుల హక్కు చట్టం తీసుకువచ్చేందుకు అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. అన్నివర్గాల అభిపాయాలను క్రోడీకరించి సమగ్రమైన చట్టం తీసుకువస్తామన్నారు. పంటల కోసం ఏప్రిల్‌లో కాకుండా ఖరీఫ్ సీజన్ ప్రారంభం అంటే జూన్‌లో రుణాలు, కౌలుదారులకు కార్డులు ఇప్పించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశమన్నారు. సకాలంలో రుణాల మంజూరుతో సాగు వైపు ప్రోత్సహించవచ్చునన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ 2019లో రూపొందించిన చట్టంలో లోపాలు, త్వరలో అమలులోకి తీసుకురానున్న చట్టంలో పొందుపరిచిన పలు అంశాలను వివరిస్తూ..రైతులు, కౌలుదారులు తగిన సూచనలు చేయాలన్నారు. సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, వ్యవసాయ శాఖ అదనపు కమిషనర్ వి.శ్రీధర్, ఇతర అధికారులు పద్మావతి, ఎం.గోపాల్, కె.అప్పలస్వామి, రైతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును డీఈవో ఎన్.ప్రేమకుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. - విశాఖపట్నం

అన్నప్రసాద వితరణ

జ్ఞానాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీహరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, శ్రీ కోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైర్లెస్ కాలనీ కోదండ రామాలయంలో మాలధారణ భక్తులకు మండలకాల మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని సోమవారం డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ ప్రారంభించారు. డిసెంబరు 7 వరకు ఈ కార్య క్రమం కొనసాగుతుందని ట్రస్ట్ అధ్యక్షులు కంచుమూర్తి వెంకటరమణమూర్తి తెలిపారు.

టీడీపీ సభ్యత్వంపై సూచన

మాధవధార, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు, నవీకరణపై దృష్టి సారించాలని నగర టీడీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ సూచించారు. సోమవారం ఆయన 50వ వార్డు కార్యకర్తలతో సమావేశమై సభ్యత్వ నమోదు విధివిధానాల్ని తెలిపారు. రూ.100/-ల నామమాత్రపు రుసుం చెల్లించి పార్టీ సభ్యులుగా గుర్తింపు పొందవచ్చని తెలిపారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దొండపర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డులో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జోనల్ కమిషనర్ రాముతో కలిసి సోమవారం పర్యటించారు. ఎమ్మెల్యే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. పలు సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించగా, మరికొన్నింటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరానగర్‌లో ఇళ్ల పట్టాలు, చాకలిపేట గెడ్డ వద్ద రక్షణ గోడ, సుబ్బలక్ష్మి కల్యాణమండపంలో పేదలకు అందుబాటులో రుసుము నిర్ణయించడం, విద్యుత్ దీపాలు, డ్రైనేజీలు, ఎర్రిగెడ్డ కాల్వలు, రోడ్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

మహిళల్లో కేన్సర్ నివారణకు కృషిచేయాలి



సదస్సును ప్రారంభిస్తున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న వైద్యులు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని, నివారణకు కృషిచేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనికాలజికల్ సొసైటీ విశాఖపట్నం ఆధ్వర్యంలో పీఎంపాలెంలోని వి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రాంతీయ వైద్య విద్యా సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము, గర్భాశయ, అండాశయ కేన్సర్లను సకాలంలో గుర్తించడంతోపాటు, అవగాహన కల్పించాలన్నారు. పీసీవోడీ నివారణకు వైద్యులు కృషి చేయాలన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను నివారించే వీలుందన్నారు. ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనికాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఓజీఎస్ఐ) అధ్యక్షులు డాక్టర్ జయదీప్ టాంక్ ఓజీఎస్‌వీ విశాఖ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వైఎల్ నర్సింగరావు, కార్యదర్శి డాక్టర్ కిరణ్మయి గొట్టపు, డాక్టర్ జీపీ రామరాజు, డాక్టర్ టి రాధ, డాక్టర్ రామరాజు, డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ సౌమిని, డాక్టర్ గీతా వందన, డాక్టర్ పద్మావతి నాయుడు, డాక్టర్ శిరీషా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ కార్గో ఎన్నడో!?

... 5వ పేజీ తరువాయి

కూడా లాభదాయకం. అంతర్జాతీయ కార్గో వ్యవహారాలను పర్యవేక్షించే సిబ్బందితో పాటు కస్టోడియన్ అవసరం. వీటిని ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సమకూర్చాల్సి ఉంది.

కేంద్ర మంత్రి చొరవ

విశాఖ నుంచి విజయవాడకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభించడానికి ఆదివారం ఇక్కడకు వచ్చిన కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధి నరేశ్‌కుమార్ ఎయిర్ కార్గో సమస్యను వివరించారు. ఇటీవల విశాఖ వచ్చిన మంత్రి లోకేశ్ దృష్టికి కూడా స్థానిక ఎంపీ శ్రీభరత్ ద్వారా ఈ సమస్యను తీసుకువెళ్లినట్టు చెప్పడంతో ఆయన వెంటనే స్పందించారు. ఢిల్లీలోని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, కార్గో రవాణాకు అవసరమైన సిబ్బందిని వీలైతే చెన్నై నుంచి విశాఖకు డిప్యుటేషన్‌పై పంపాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా కార్గో విదేశాలకు వెళ్లేలా చూడాలని సూచించారు. ఇది ఎంతవరకు అమలు అవుతుందో వేచిచూడాలి.

జ్వరం, ఒళ్లు నొప్పులు

... 5వ పేజీ తరువాయి

డెంగ్యూ, మలేరియా పరీక్షలు చేయిస్తే నెగెటివ్ వచ్చిందని, టైఫాయిడ్ పాజిటివ్ వచ్చిందని ఓ వైద్యుడు తెలిపారు. కొందరిలో లక్షణాలు కనిపించక పోయినా పాజిటివ్ వస్తుందని, లక్షణాలతో బాధపడుతున్న వారికి నెగిటివ్ వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ప్రాణాంతక స్థాయిలో సమస్య లేకపోవడం ఉపశమనం కలిగిస్తోందంటున్నారు.

ఆందోళన వద్దు

కొద్దిరోజులుగా నమోదవుతున్న కేసులన్నీ భిన్నంగా ఉంటున్నాయి. ఒకే విధమైన లక్షణాలు కనిపిస్తున్నాయి. కొంతమందికి టైఫాయిడ్ పాజిటివ్ వస్తోంది. మరికొందరికి డెంగ్యూ పాజిటివ్ వస్తోంది. ఇంకొందరికి మలేరియా పాజిటివ్ వస్తోంది. అందరిలోనూ తీవ్ర జ్వరం, బాడీ, జాయింట్ పెయిన్స్ కనిపిస్తున్నాయి. కొందరిలో ఫీవర్ లేకుండా కేవలం నొప్పులు మాత్రమే ఉంటున్నాయి. దీంతో పరీక్షలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతిరోజూ రెండు, మూడు చికున్‌గున్యా తరహా కేసులు వస్తున్నాయి. కానీ, నిర్ధారణ కాలేదు. వీటిని ఎటిపికల్ ప్రజంటేషన్‌గా భావించి మందులిస్తున్నాం.

– డాక్టర్ వై.జ్ఞానసుందరరాజు, విశ్రాంత జనరల్ మెడిసిన్ విభాగ వైద్యులు, కేజీహెచ్

చికున్ గున్యా కేసుల్లేవ్

జిల్లాలో చికున్ గున్యా కేసులు నమోదు కాలేదు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 77 మందికి పరీక్షలు చేస్తే ఒకే ఒక్క పాజిటివ్ కేసు వచ్చింది. ప్రస్తుతం కనిపిస్తున్న కేసుల్లో ఎక్కువగా టైఫాయిడ్ ఉంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 2,22,187 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా 133 పాజిటివ్ వచ్చాయి. 6,473 మందికి డెంగ్యూ పరీక్ష నిర్వహించగా 572 మందికి పాజిటివ్ వచ్చింది. అనుమానిత కేసులుంటే పరీక్షలు నిర్వహిస్తాం. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ ఎం.తులసి, జిల్లా మలేరియా అధికారి

మొక్కల పేరుతో మెక్కేశారు

... 5వ పేజీ తరువాయి

అందేలా చూడాలి. అందుకు బదులు బయట నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించి పోయడం ప్రారంభించారు. వేసవిలో నీరందించే విషయంలో నిర్లక్ష్యం చూపారు. బయట నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశామంటూ కిందిస్థాయి అధికారులు తప్పుడు లెక్కలు చూపించి సొమ్ములు దిగమింగారంటున్నారు. దీనికితోడు మొక్కల చుట్టూ కలుపుతీయకుండా వదిలేశారు. దీంతో కొన్ని మొక్కలు చనిపోగా, మరికొన్ని నాటినట్టుగానే ఉన్నాయి. కొద్దిమొక్కలు మాత్రమే ఒక అడుగు నుంచి రెండు అడుగుల ఎత్తు వరకు పెరిగాయి. కేవలం అధికారుల పర్యవేక్షణ కొరవడంతో మొక్కల పెంపకం ఉద్దేశం నెరవేరలేదు. సంరక్షణ పేరిట నిధులు భారీగా స్వాహా చేశారనే వాదన వినిపిస్తోంది. కాగా చుట్టూవేసిన ఫెన్సింగ్ చాలా వరకు తుప్పు పట్టింది. కొన్నిచోట్ల ఫెన్సింగ్‌ను దొంగలు ఎత్తుకుపోయారు.

మొక్కలు లెక్కించాలని ఆదేశాలు

ఇటీవల అటవీ శాఖ రేంజర్, డీఎఫ్‌వో, సీసీఎఫ్ బదిలీ అయ్యారు. సీసీఎఫ్, రేంజర్ కొత్తగా రాగా డీఎఫ్‌వో పోస్టు ఇంకా భర్తీచేయలేదు. కొత్తగా వచ్చిన రేంజర్ శాస్త్రి సాగర్‌నగర్ సమీపంలో నాటిన సరుగుడు మొక్కలు పరిశీలించారు. ప్రస్తుతం అక్కడ ఎన్ని మొక్కలు ఉన్నాయి?, ఎన్ని చనిపోయాయనేది తేల్చాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. పొదల మధ్యన ఉన్న మొక్కలు లెక్కించడం ఎలా సాధ్యమని సిబ్బంది అడుగుతున్నారు. కలుపు తీసిన తరువాతే మొక్కలు లెక్కించడం సాధ్యపడుతుందని అంటున్నారు. ఈ మొక్కల పెంపకం కోసం పోర్టు ఇచ్చిన నిధులు వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి ఉచిత గ్యాస్ బుకింగ్

... 5వ పేజీ తరువాయి

5.29 లక్షల మంది లబ్ధిదారులకు ఉచిత సిలిండర్ల పంపిణీ నిమిత్తం రూ.128.7 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనున్నది. కాగా ఉచిత సిలిండర్ పొందే సమయంలో ఇబ్బందులుంటే సమీపంలో గ్యాస్ ఏజెన్సీకి లేదా పౌర సరఫరాల శాఖ కార్యాలయాలకు వెళ్లి అధికారులను సంప్రతించాలని జేసీ కోరారు. ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ సిలిండర్లు దుర్వినియోగం చేయవద్దని కోరారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, నిలిపివేసిన హెచ్‌ఆర్ఏ, ఇతర ఆర్థిక ప్రయోజనాలను పునరుద్ధరించాలని, టౌన్‌షిప్ నివాసితులకు విద్యుత్ బిల్లు తగ్గించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్లాంటులో పూర్తిస్థాయి ఉత్పత్తికి తగిన వనరులు కల్పించాలన్నారు. సెప్టెంబరు జీతం ఇప్పటివరకూ ఇంకా పూర్తిగా ఇవ్వలేదని, తక్షణం ఏర్పాట్లు చేయాలన్నారు. కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరాం, ఎస్.మోహన్‌బాబు, జె.రామకృష్ణ, నీరుకొండ రామచంద్రరావు, రామస్వామి, పీవీ రమణమూర్తి, పీవీ నగేష్, జి.గణపతిరెడ్డి, విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, సురేష్‌బాబు, పరంధామయ్య, జి.ఆనంద్ పాల్గొన్నారు.

నేడు ఓటర్ల జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

నెలరోజులపాటు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. అభ్యంతరాలను పరిష్కరించిన తరువాత వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీన మలి జాబితా విడుదలవుతుందన్నారు. అనంతరం జనవరి ఆరో తేదీన సవరణ ప్రచురిస్తామన్నారు. ఈ క్రమంలో వచ్చే నెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానిశంకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, సోడదాసు సుధాకర్, కృష్ణకాంత్, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

వీఆర్ఎస్ సర్వేకు నేటితో గడువు పూర్తి

... 5వ పేజీ తరువాయి

పొందుపరచాలని సూచించింది. కనీసం 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలని షరతు పెట్టింది. దీనికి ఉద్యోగుల నుంచి ఆశించిన దానికంటే ఎక్కువగానే స్పందన వచ్చింది. ఈ నెల 29వ వరకు అభిప్రాయాలు చెప్పేందుకు గడువు ఉండగా 28వ తేదీ అంటే సోమవారం నాటికి రెండు వేల మంది సానుకూలత వ్యక్తంచేశారు. యాజమాన్యం ఇచ్చే పరిహారం తీసుకొని వెళ్లిపోయేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.



ఎమ్మెల్సీ చిరంజీవరావును కలిసిన డీఈఓ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావును ఆయన కార్యాలయంలో డీఈఓ ఎన్. ప్రేమకుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

వృక్ష సంరక్షణతోనే జీవ మనుగడ

వెంకోజీపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వృక్షాలను సంరక్షిస్తేనే జీవుల మనుగడ సాధ్యమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. సోమవారం వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏయూ బొటానికల్ గార్డెన్లో ఆయన స్వయంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో వృక్ష సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. నగరంలో అతిపెద్ద హరిత ప్రాంగణంగా ఏయూ నిలుస్తోందన్నారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం మనందరి బాధ్యత అని తెలుసుకుని నడుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బొటానికల్ గార్డెన్లో అవకాడో, లక్ష్మణ ఫలం, మల్బరీ, లిచ్చి, మామిడి తదితర పండ్లను ఇచ్చే మొక్కలు నాటారు. పక్షులకు ఆహారాన్ని అందించడం సాధ్యపడుతుందన్న అభిప్రాయంతో ఈ మొక్కలను నాటారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్. రాజు, బోటనీ విభాగాధిపతి సంధ్యదీపిక, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్ కుమార్, విభాగాచార్యులు ఎస్.బి.పడాల్, సుజాత, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పది మందికి జరిమానా

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రెండవ స్పెషల్ జ్యుడిషియల్ కోర్టు న్యాయమూర్తి పది మందికి జరిమానా విధించారు. పీఎంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. స్టేషన్ పరిధిలో మధురవాడ, పీఎంపాలెం, మారికవలస ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

సినిమా గైడ్

● వీనమ్ : మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● పొట్టేల్ : వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● ఎంతపనిచేసావ్ చంటి : వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)

● లగ్గం : విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)

● దేవర :జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● వేట్టయాన్ : సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)

● విశ్వం : శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● జనక అయితే గనక : శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 38, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 52, పచ్చిమిర్చి 48 కాకరకాయలు 44, బీరకాయలు 30, ఆనపకాయలు 34, కాలీఫ్లవర్ 60, క్యాబేజ్ 30, క్యారేట్ 54 దొండకాయలు 50, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 60, బరబటి 50, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 40, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 52, కీరదోస 30, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 28, కంద 68, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226



కళాభారతి బజార్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు



పిఠాపురం కాలనీలో ఇలా..

అధికారులూ... ఇది తగునా?

» మద్దిలపాలెంలో ఎక్కడ చూసినా... చెత్తాచెదారమే దర్శనం
» దోమల వ్యాప్తితో వ్యాధుల ముప్పు
» పారిశుధ్య లోపంపై ఫిర్యాదుల వెల్లువ

మద్దిలపాలెం,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోగాలు ప్రబలుతున్నందున ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ నీరు,చెత్త నిల్వ లేకుండా చూసుకోవాలని జీవీఎంసీ అధికారులు మైకులో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మరోవైపు వీధులకు మినహాయింపు అన్నట్లుగా తమ విధులను విస్మరిస్తున్నారు. 22వ వార్డులో అస్తవ్యస్తంగా కనిపిస్తున్న పారిశుధ్యమే ఇందుకు ప్రబల ఉదాహరణ. రోజుల తరబడి వ్యర్థాల నిల్వతో కాలనీ వీధులు కంపు కొడుతున్నాయి. వార్డులోని పిఠాపురం కాలనీ, మంగాపురం కాలనీ, పీతలవానిపాలెం, నేతాజీనగర్, శివాజీపాలెం, ఆరుకుళాయిల జంక్షన్, రేసపువానిపాలెం, సిద్దార్థనగర్, బలరాంనగర్, రాజీవ్‌నగర్, బాలాజీనగర్ తదితర ప్రాంతాలు చెత్తకుప్పలతో నిండిపోయాయి. రహదారులు కూడా వ్యర్థాలతో అధ్వానంగా తయారయ్యాయి.చెత్త తరలించే వాహనాలు రెండు రోజులకోసారి వస్తున్నాయి. మళ్లీ చెత్త తొలగింపు వాహనం వచ్చేవరకు రోడ్డుపైనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. సకాలంలో కాల్వల్లో చెత్తను తొలగించకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉంటోంది. ఈ కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి.ఇళ్లలో నీరు నిల్వ ఉండకూడదని జీవీఎంసీ అధికారులు అవగాహన కల్పిస్తున్నా, మరోపక్క వారే మురుగు కాలువలను శుభ్రం చేయించడం లేదని స్థానికులు తప్పుపడుతున్నారు. మలేరియా,టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి.



నేతాజీనగర్‌లో చెదిరిపోయిన చెత్త

పర్యవేక్షణ లోపం..

స్థానిక 22వ వార్డులో పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా పారిశుద్ధ్యం పడకేసింది. వార్డులోని ఏడు సచివాలయాల్లో ఏడురుగు శానిటరీ కార్యదర్శులున్నారు.ఈ వార్డులో పనిచేసిన శానటరీ ఇన్‌స్పెక్టర్ బదిలీపై వెళ్లిపోవడంతో ఓ సెక్రటరీని ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఆయా కార్యదర్శులు సచివాలయాలకే పరిమితమవడంతో అపారిశుద్ధ్యంతో వార్డు నిండిపోయింది. పారిశుద్ధ్య కార్మికుల నిర్లక్ష్యం వల్ల రోజూ చెత్త కుప్పలు తొలగించకపోవడంతో వీధుల్లో పేరుకుపోయాయి. అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమేనని పలువురు ఆరోపిస్తున్నారు. ఇళ్ల ముందు చెత్త కుప్పలతో కంపు కొట్టడంతో స్థానికులు జోన్-3 అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్ కుమార్

తాగునీటి పరీక్షలు తప్పనిసరి

జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

వెంకోజీపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ నగర ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలని కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి. శివప్రసాద్‌రాజు, నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎన్ రవితో కలిసి బర్మాకాలనీలో ఉన్న బ్లాక్ నంబర్ 18 నీటి సరఫరా పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ఈమేరకు బర్మా కాలనీ పంప్ హౌస్ వద్ద సరఫరా అవుతున్న నీటి నాణ్యతను పరిశీలించారు. పంప్ హౌస్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో రోజుకు ఎన్ని శాంపిల్స్‌కు పరీక్షలు నిర్వహిస్తున్నారని కమిషనర్ ఆరా తీయగా పర్యవేక్షక ఇంజనీర్ స్పందిస్తూ ప్రతిరోజూ 18 నీటి శాంపిల్స్‌కు పరీక్షలు చేస్తున్నామని వివరించారు. అనంతరం కమిషనర్ అక్కడికి సమీపంలో ఉన్న ఒక ఇంటి వద్ద వ్యక్తిగత నీటి కొళాయిలో వస్తున్న నీటిని స్వయంగా పరిశీలించారు. నీటి నాణ్యత 2 పీపీఎం, ఈసీ 320గా నమోదైందని, రీజనల్ పబ్లిక్ హెల్త్ లొబరేటర్ సీనియర్ ఎనలిస్ట్ శివరామకృష్ణ కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏయూ మైదానంలో 150 బాణసంచా దుకాణాలు



ఏయూ మైదానంలో ఏర్పాటు చేస్తున్న దుకాణాలు

మద్దిలపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏయూ మైదానంలో 150 బాణసంచా స్టాల్స్‌కు అనుమతులిచ్చారు. సోమవారం తాత్కాలిక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వీటితోపాటు విశ్వప్రియ ఫంక్షన్ హాల్లో రెండు, వాల్తేరు క్లబ్‌లో రెండు విక్రయ స్టాల్స్ ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు. ఆయా స్టాల్స్‌కు ఇంకా అనుమతులు ఇవ్వలేదు.ఏయూ మైదానంలో స్టాల్స్‌కు నిబంధనలతో కూడిన అనుమతులిచ్చారు. ప్రతీ స్టాల్ వద్ద నీటి డ్రమ్ములు ఏర్పాటు చేయాలి. ఇసుక నింపిన బకెట్‌లు ఉంచాలి. స్టాల్స్ మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. ప్రస్తుతం ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద నీటి డ్రమ్ములు, బకెట్లు లేవు. స్టాల్స్ మధ్య దూరం కూడా తక్కువే.

నిబంధనలు పాటించాల్సిందే

బాణ సంచా విక్రయాలకు ఇక్కడ మూడు రోజులే అనుమతి ఉంది. 29, 30, 31 తేదీల్లో ఈ విక్రయాలు ఉండగా ముందు రోజు స్టాల్స్ ఏర్పాటు చేశారు. నీటి డ్రమ్ములు, ఇసుక బకెట్ల గురించి ప్రస్తావించగా విక్రయాల రోజు నుంచి ఏర్పాటు చేస్తామని బదులిచ్చారు. బాణసంచా విక్రయాల్లో తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. అలాకాకుండా స్టాల్స్ ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా శాంతిభద్రతల పర్యవేక్షణకు పోలీస్ సిబ్బందిని విధుల్లో పెట్టాం.

- పల్లా రమణయ్య, త్రీటౌన్ సీఐ

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

» సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్ కుమార్ సిన్హా



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న సీజీఎం సంజయ్ కుమార్ సిన్హా

పరవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అవినీతి రహిత సమాజ స్థాపనకు అంతా కృషి చేద్దామని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్ కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాలను సోమవారం ప్లాంట్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతికి అంతా దూరంగా ఉండాలన్నారు. వచ్చే నెలమూడో తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీపీజీ విభాగం సీజీఎం ఫరిదా, సంస్థలోని వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, సీఐఎస్ఎఫ్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో దీపాల ప్రదర్శన



దీపాల వద్ద దివ్యాంగ విద్యార్థులు

పెదవాల్తేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ ప్రత్యేక పాఠశాలలో దీపావళి సంబరాలు కనుల పండువగా జరిగాయి. వివిధ ఆకృతులలో 3,500 ప్రమిదలను తయారు చేసి వాటికి ముచ్చటైన రంగులు వేసి ప్రదర్శనకు ఉంచారు. అంచున స్కూల్ పేరును ప్రమిదలతో అలంకరించి మరింత ఆకర్షణీయం చేశారు. ఇలా తయారు చేసిన ప్రమిదలను స్కూల్‌కి సహకరిస్తున్న దాతలకు, పెద్దలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. సోమవారం విశాఖ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మట్టి ప్రమిదల సందర్శనను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు చేసిన మట్టి ప్రమిదలు, వాటి ప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. వీరు చేస్తున్న పనిని మెచ్చుకున్నారు. దివ్యాంగ పిల్లలు తయారు చేసిన ప్రమిదలు చూస్తుంటే, వీరిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న కండిపల్లి శ్రీనివాసరావును, వారి సిబ్బంది అభినందనీయులన్నారు. అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

బీచ్ రోడ్డులో ఫ్లాష్ మాబ్



నృత్యం చేస్తున్న యువతీ యువకులు

రామ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు సంస్మరణ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. సోమవారం బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద శ్రీ కాశ్యప్ విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించారు. దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరులకు నివాళులర్పిస్తూ సెల్యూట్ స్కిట్ ప్రదర్శించారు. దేశభక్తి పాటలకు నృత్యాలు చేశారు. విద్యార్థుల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధి టిఆర్ఎస్ వర్మ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందిని స్మరించుకోవటం ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణమూర్తి, సత్యనారాయణ, జ్యోత్స్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని గాయపరిచి నగదు అపహరణ

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ బస్టాప్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఓ వ్యక్తిని ఇద్దరు గాయపరిచి రెండు వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నీలాతి అప్పలనాయుడు టీఎస్సార్ ప్రెస్టేజ్ -1 అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా చేయడంతోపాటు చిన రుషికొండలోని వీ కంఫార్ట్‌లో బాయ్‌గా పని చేస్తున్నాడు. మేనకోడలి పెళ్లి చూపులకని ఆదివారం ఆయన పార్వతీపురం వెళ్లాడు. తిరిగి పార్వతీపురం నుంచి ఎండాడ బస్టాప్ వద్ద రాత్రి 12 గంటలకు దిగి కాలినడకన ఇంటికి వెళ్తుండగా విజయా వైన్స్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఆయన్ను అడ్డుకున్నారు. నగదు ఇమ్మని బెదిరించారు. నిరాకరించడంతో వారి వద్ద ఉన్న బీర్ బాటిల్‌తో తలపైన, వెనుక భాగంలో కొట్టి రెండు వేల రూపాయలు, సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. అప్పలనాయుడు ప్రస్తుతం గీతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల్లో కేన్సర్ నివారణకు కృషి చేయాలి

» గైనకాలజీ వైద్య విద్యా సదస్సులో సీపీ శంఖబ్రత బాగ్చీ



సదస్సును ప్రారంభిస్తున్న సీపీ, పాల్గొన్న వైద్యులు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని, నివారణకు కృషిచేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనికాలజికల్ సొసైటీ విశాఖపట్నం ఆధ్వర్యంలో పీఎంపాలెంలోని వి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రాంతీయ వైద్య విద్యా సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము, గర్భాశయ, అండాశయ కేన్సర్లను సకాలంలో గుర్తించడంతోపాటు, అవగాహన కల్పించాలన్నారు. పీసీఓడీ నివారణకు వైద్యులు కృషి చేయాలన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను నివారించే వీలుందన్నారు. ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనికాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఓజీఎస్ఐ) అధ్యక్షులు డాక్టర్ జయదీప్ టాంక్ ఓజీఎస్వీ విశాఖ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వైఎల్ నర్సింగరావు, కార్యదర్శి డాక్టర్ కిరణ్మయి గొట్టపు, డాక్టర్ జీపీ రామరాజు, డాక్టర్ టి రాధ, డాక్టర్ రామరాజు, డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ సౌమిని, డాక్టర్ గీతా వందన, డాక్టర్ పద్మావతి నాయుడు, డాక్టర్ శిరీషా రాణి తదితరులు పాల్గొన్నారు.



రహదారిపై ఆక్రమణలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆక్రమణల తొలగింపు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణలపై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు, రహదారులపై వాహనాలు శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన కథనం మేరకు ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్, జీవీఎంసీ సిబ్బందితో కలిసి ఎంవీపీ సర్కిల్ నుంచి కరాచీ బేకరీ వరకూ ఆక్రమించిన రహదారులు, ఫుట్‌పాత్‌లను తొలగించారు. పాదచారులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా తొలగింపు జరుగుతున్నప్పుడు ఆయా దుకాణాలు పెట్టుకోవడానికి కొంత సొమ్ము తీసుకుని, అనుమతి ఇచ్చిన వారికి వ్యాపారులు ఫోన్లు చేశారు. కొద్ది రోజులు మిన్నకుంటే మళ్లీ వ్యాపారాలు చేసుకోవచ్చని వారు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

అతిథి అధ్యాపకుల నియామకంపై హర్షం



ఎమ్మెల్యే వెలగపూడితో మాట్లాడుతున్న సురేష్‌మీనన్

వెంకోజీపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏయూ అధ్యాపకులను పునర్నియమించడానికి కృషి చేసిన తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఏయూ పరిరక్షణ కమిటీ సభ్యుడు సురేష్‌మీనన్ అభినందనలు తెలిపారు. సోమవారం ఏయూకి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి అతిథి అధ్యాపకులకు నెలవారీ జీతాలు ఇప్పించాలని కోరారు. ఏయూ పూర్వ వైభవానికి అతిథి అధ్యాపకులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కమిటీ సభ్యులు డాక్టర్ దాస్, డాక్టర్ శ్రీను, ఆవుల రమేష్ తదితరులు ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న డీసీపీ అజిత వేజేండ్ల

మద్దిలపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఏయూ వైవీఎస్ ఆడిటోరియంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర డీసీపీ-1 అజిత వేజేండ్ల మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణదాతలవుతారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేక అనేక మంది ప్రాణాలు విడుస్తున్నారన్నారు. అందుకే ప్రతీ ఒక్కరూ ముఖ్యంగా విద్యార్థులు రక్తదానం చేయడానికి ఆసక్తి చూపాలన్నారు. దీనివల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడినవారవుతన్నారు. రక్షక భటులంటే ప్రజలను అన్ని రకాలుగా రక్షించడంలో ముందుండాలన్నారు. రక్తదానం చేసిన పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తూర్పువిభాగం ఏసీపీ లక్ష్మణమూర్తి, త్రీటౌన్ సీఐ పి.రమణయ్య అధికారులు పాల్గొన్నారు.

రసాయనశాస్త్ర ప్రయోగశాల ప్రారంభం



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూ రసాయన శాస్త్ర విభాగవిద్యార్థులకు ఉపయుక్తంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధునీకీకరించిన ప్రయోగశాలను వీసీ ఆచార్య జి. శశిభూషణరావు సోమవారం ప్రారంభించారు. ప్రయోగశాలకు దాదాపు రూ.28 లక్షలు వెచ్చించారని, దీనిలో రూ.20 లక్షలు అరబిందో ఫార్మా ఫౌండేషన్ అందించిందని వీసీ తెలిపారు. అరబిందో ఫార్మా వైస్ ఛైర్మన్, ఎండీ కె. నిత్యానందరెడ్డి అరబిందో ఫార్మా సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా వీటిని అందజేశారని, వీరితోపాటు ఏయూ రసాయన శాస్త్ర విభాగం 1990-92 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.8 లక్షలను సమకూర్చారని వీసీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

గోవా బీచ్‌లో కార్పొరేటర్ల బృందం



గోవాలోని మేరా మీర్ బీచ్ వద్ద కార్పొరేటర్లు

వెంకోజీపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కార్పొరేటర్ల బృందం సోమవారం గోవా రాజధాని పనాజీలో ఉన్న మేరా మీర్ బీచ్‌ను సందర్శించారు. ఈమేరకు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు మేరామీర్ బీచ్‌ను సందర్శించి, తీరంలో అనుకోని ప్రమాదాలు జరిగితే ఏవిధంగా రక్షించాలన్న అనే అంశంపై శిక్షణ పొందారని చెప్పారు. అలాగే సముద్రపు ఒడ్డును ప్రజలను అప్రమత్తం చేయడానికి ఉపయోగిస్తున్న రోబో మిషన్, అనౌన్స్మెంట్, సీసీ కెమెరాల పర్యవేక్షణ, ప్రథమ చికిత్స తదితర అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ వార్షికోత్సవానికి కమిషనర్‌కు ఆహ్వానం

వెంకోజీపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సీబీఎస్ఈ బ్రాంచి వార్షికోత్సవం నవంబరు 23న నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌ను స్కూల్ ఫాదర్‌లు విజయకుమార్, మనోజ్‌లు సోమవారం ఆహ్వానించారు.